


కేబుళ్ల తొలగింపు.. నిలిచిన ఇంటర్‌నెట్

పరిగి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిగిలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు కేబుల్ ఆపరేటర్ల కేబుళ్లను తొలగించారు. పట్టణంలో వెయ్యి వరకు ఉన్న కనెక్షన్ల తొలగింపుతో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. ఈ కేబుళ్లతోనే నగరంలో ప్రమాదం జరిగిందన్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాల నుంచి కేబుళ్లను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.



ఎఫ్‌ఆర్‌ఎస్‌ను త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జూనియర్ కాలేజీల ప్రిన్స్‌పాల్స్‌ను అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జూనియర్ కాలేజీల ప్రిన్స్‌పాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఇంటర్ విద్యార్థుల డిజిటల్ ఫర్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్‌లో ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్(ఎఫ్‌ఆర్‌ఎస్) అప్‌డేట్ చేస్తేనే ఎస్సీ అభివృద్ధి శాఖ పోర్టల్‌లోనికి వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ థీమ్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. కొన్ని కాలేజీలలో ఎక్కువ పెండింగ్ ఉండటానికి గల కారణాలు వలస విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడమేనని ప్రిన్స్‌పాల్స్ వివరించారు. ఆన్‌లైన్‌లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కాలేజీలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. కాలేజీలలో అవసరమైన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, డ్రైనేజీ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్ కుమార్, ప్రిన్స్‌పాల్స్ పాల్గొన్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వానాకాలం పంటలు కళకళలాడుతున్నాయి. కనుచూపు మేరలో ఎక్కడ చూసినా పచ్చదనమే దర్శనమిస్తోంది. ఈ వానాకాలం సీజన్‌లో మూడు జిల్లాల్లో ఇప్పటి వరకు కురవాల్సిన సాధారణ వర్షపాతం కంటే అధికంగా కురిసింది. చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. భూగర్భ జలాలు దండిగా పెరిగాయి. దీంతో పంటల సాగు కూడా గణనీయంగా పెరిగింది. అలాగే రానున్న యాసంగిలోనూ సాగుకు నీటి కొరత ఉండే అవకాశం లేదు. సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ రైతులను యూరియా కొరత మాత్రం వేధిస్తోంది. నిత్యం నత్రజని కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



బొంరాస్‌పేట్‌లో కళకళలాడుతున్న వరిపంట

సాగు కళకళ

వానాకాలంలో గణనీయంగా పెరిగిన పంటలు

వర్షపాతం ఇలా..

జిల్లా	సగటు	ప్రస్తుతం	శాతం
రంగారెడ్డి	452.4	672.8	49 అధికం
వికారాబాద్	554	710.7	28 అధికం
మేడ్చల్	505.3	626.8	24 అధికం

జిల్లాల వారీగా పంటల సాగు శాతం

రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
94.70	92.10	89.28



పెద్దేముల్ మండలం తట్టేపల్లిలో పత్తిచేను

సగటుకు మించి వరి, పత్తి, మొక్కజొన్న సాగు

వికారాబాద్‌లో రికార్డుస్థాయిలో 2.52లక్షల ఎకరాల్లో పత్తి

రంగారెడ్డిలో అధికంగా వరి, మొక్కజొన్న పంటలు

రైతులను వేధిస్తున్న యూరియా కొరత

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాలు విస్తారంగా కురవడంతో ఈ సారి వానాకాలం (ఖరీఫ్ సీజన్) కళకళలాడుతోంది. దాదాపు నెల రోజుల నుంచి మూడు జిల్లాల్లో దండిగా వర్షాలు పడడంతో పంటల సాగు అనూహ్యంగా పెరిగింది. దీంతో ఈ సీజన్ గట్టెక్కింది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఈ సీజన్ పంటల సాగు దాదాపు సగటుకు చేరుకుంది. ఇప్పటికే మొక్కజొన్న, వరి, పత్తి పంటలు సగటుకు మించి రైతులు సాగు చేశారు. వరి సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం సన్న రకం బియ్యానికి ప్రోత్సాహకం అందిస్తున్న విషయం తెలిసిందే. దీంతో రైతులు సన్నాలు సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. దీంతో వరి సాగు వందశాతం దాటింది. అలాగే రంగారెడ్డి జిల్లాలో అంచనాలకు మించి మొక్కజొన్న పంట సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో పత్తి రికార్డు స్థాయిలో సాగు చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 2.52లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. అయితే ఇక్కడ కందితో పాటు మొక్కజొన్న పంటల సాగు గణనీయంగా తగ్గింది. మొత్తం మీద ఈ ఖరీఫ్ సీజన్‌కు వాతావరణం అనుకూలించడంతో ఉమ్మడి జిల్లాలో ఆశించిన స్థాయిలో రైతులు పంటలు వేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కురవాల్సిన వర్షం కంటే మూడు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. రంగారెడ్డిజిల్లాలో 49శాతం అధికంగా, వికారాబాద్ జిల్లాలో 28శాతం అధికంగా, మేడ్చల్ జిల్లాలో 24శాతం అధిక

మిగతా 7వ పేజీలో...



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మ విశ్వాసంతో వ్యాపార వేత్తలుగా ఎదుగాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీ హబ్ ఆధ్వర్యంలో జిల్లా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామిక వేత్తలకు ర్యాంప్ వుమెన్ యాక్సెలరేషన్ ప్రోగ్రామ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల ద్వారా ఉత్పత్తి రంగంలో రాణించి తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. డీఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకులు, స్త్రీ నిధి ద్వారా సంవత్సరానికి రూ.610 కోట్ల రుణాలు అందిస్తున్నట్లు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ శిక్షణ ద్వారా మహిళలు వ్యాపారాలు నిర్వహించుకొని ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడుతూ టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్పత్తుల తయారీ, హస్తకళలు వంటి రంగాల్లోని వ్యాపారులకు నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహబ్ అసోసియేట్ డైరెక్టర్ శ్రీ ఊహ, పరిశ్రమల శాఖ జీఎం మహేశ్వర్, వీ హబ్ ప్రాజెక్ట్ మేనేజర్ తాజ్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సాయిరామ్, అడిషనల్ ఆర్డీవో నర్సింలు, మెప్మా పీడీ రవికుమార్, డీపీఎం కొమరయ్య, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, మహిళా సంఘాల సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిల్కూరులోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నిర్వహించే మగ్గం వర్క్ ఉచిత శిక్షణా తరగతులకు ఆసక్తికలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శిక్షణా తరగతులకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు యువతులు, మహిళలు పదో తరగతి మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మగ్గం వర్క్‌లో 30 రోజులు ఉచిత శిక్షణతో పాటు ఉచిత హాస్టల్ వసతి, యూనిఫాం, టూల్ కిట్స్, అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 8500165190, 9550606019, 7981951167 నంబర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.



సీపీఏ సమావేశాల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్

బెంగళూరులో జరుగుతున్న 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్ రెండో రోజు శనివారం జరిగిన చర్చలలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఆయనతో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

-వికారాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి)

అలుగెత్తిన ప్రాజెక్టులు

సాగునీటి వనరులకు జలకళ.. హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/శామీర్‌పేట : జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు, సాగునీటి ప్రాజెక్టులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుకుని జలకళతో కళకళలాడుతున్నాయి. జిల్లాలో 1,187 సాగునీటి వనరులు ఉండగా, వాటిలో 354 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. 729 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీరు చేరుకోగా, 104 చెరువుల్లో 50 నుంచి 75 శాతం మేరకు నీరు చేరింది. జిల్లాలో లక్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్, అల్లాపూర్, కొంశెట్‌పల్లి, కక్రవేణి వాగు, కోట్‌పల్లి, జుంటుపల్లి, నందివాగు ప్రాజెక్టులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి.

నాలుగు చెరువులకు గండి..

ఇదిలా ఉంటే సాగునీటి వనరులపై అధికార యంత్రాంగం నిఘా పెంచింది. వరద ఉధృతికి చెరువుల వద్ద ప్రమాదకర

మిగతా 8వ పేజీలో...



అలుగు పారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

3వేల ఎకరాల ఆయకట్టుకు..

శామీర్‌పేట పెద్ద చెరువు నిండు కుండలా మారింది. ఈ చెరువు నిండితే మూడు వేల ఎకరాల విస్తీర్ణం ఆయకట్టులో వరి సాగు అవుతుంది. వర్షాకాలం సీజన్‌లో ఒకసారి ఈ పెద్ద చెరువు పూర్తిగా నిండితే రెండు పంటల వరకు సాగునీటికి ఇబ్బంది ఉండదు. శామీర్‌పేట, అలియాబాద్, బాబాగూడ, బొమ్మరాశిపేట, జగ్గంగూడ గ్రామాల పరిధిలోని మూడు వేల ఎకరాల వరి సాగుకు ఈ చెరువు ద్వారా సాగు నీరు సరఫరా అవుతోంది. అలాగే పెద్దవాగు ద్వారా ఉద్దమర్రి, ఉషార్‌పల్లి మీదుగా యాదాద్రి జిల్లా పరిధిలోని బీబీనగర్, భువనగిరి వరకు నీరు వెళ్తుంది. కాగా, శామీర్‌పేట పెద్ద చెరువును కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద మేజర్ ఇరిగేషన్ శాఖ వారు మేయింటెనెన్స్ చేస్తున్నారు.

మాతృమరణాలు జరగకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ఉమాగౌరి

జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి

మేడ్చల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాతృ మరణాలు జరుగకుండా ఉండేందుకు జిల్లాలో అన్ని స్థాయిల వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా మాతృ మరణాల ఉప కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ గర్భిణికి ప్రాథమిక స్థాయి నుంచే సమగ్ర సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. హైరిస్క్ గర్భిణిల్లో వచ్చే రక్తహీనత, హైబీపీ, ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రతీ మొదటి కాన్పును హై రిస్క్ కేసుగానే గుర్తించాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో నమోదైన మూడు మాతృ మరణాలపై సమగ్రంగా సమావేశంలో చర్చించారు. సమావేశంలో వైద్యాధికారులు సత్యవతి, గీత, మల్లీశ్వరీ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



జైలు సూపరింటెండెంట్‌కు బంగారు పతకం



బంగారు పతకంతో రాజ్‌కుమార్

పరిగి,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిసిన్స్ డ్యూటీ మీట్ - 2025లో పరిగి సబ్‌జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌కు బంగారు పతకం లభించింది. తెలంగాణ జైళ్లశాఖ వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌తో విజయఢంగా మోగించింది. దేశంలోని 21 రాష్ట్రాలు పాల్గొన్న ఈ జాతీయ పోటీల్లో తెలంగాణ జైళ్ల శాఖ ప్రతిభను చాటింది. ఇందులో పరిగి జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌కు ఫస్ట్ ఏయిడ్ విభాగంలో ఈ పతకాన్ని సాధించారు. ఈ మేరకు జైళ్ల శాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు.

15, 16తేదీల్లో డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 15, 16వ తేదీల్లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీవీ గీతాలక్ష్మి పట్నాయక్ సూచించారు. బీఏ ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియం, బీకాం ఇంగ్లిష్ మీడియం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ తెలుగు, ఇంగ్లిష్ మీడియం మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అడ్మిషన్లు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం మాత్రమే జరగనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం

దుద్యాల/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను వినియోగించడంతో మంచి దిగుబడి సాధించేందుకు అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం అన్నారు. శుక్రవారం దుద్యాల మండలంలోని హస్నాబాద్ రైతు వేదికలో రైతులకు యూరియా పంపిణీని పరిశీలించారు. సాంప్రదాయ యూరియా కంటే నానో యూరియా చాలా తక్కువ మోతాదులో అవసర పడుతుందన్నారు. నానో యూరియాతో పంటల సాగు లాభాదాయకమని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, దుద్యాల ఏవో నాగరాజు, ఏఈవోలు భావన, రేణుక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

బొంరాస్‌పేట్ మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. దుకాణాదారులు రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు. రైతులు ఆందోళన చెందొద్దని రైతులకు అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో పోలప్ప తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

కోట్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేరాలను అరికట్టడానికి పోలీసులు కృషి చేయాలని, అలాగే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పరిసరాల పరిశుభ్రత, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు, ఎఫ్‌ఐఆర్‌లను, కేస్ డైరీలు, కేసుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాలను, ఆత్మహత్యలను, రోడ్డు ప్రమాదలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. శాంతి భద్రతలను కాపాడటానికి పోలీసులు నిరంతరం కృషి చేయాలన్నారు. చోరీలు, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదును సకాలంలో స్వీకరించి, విచారణను వేగవంతం చేయాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ధారూర్ సీఐ రఘురాములు, ఎస్ ఐశైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

చేవెళ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. శుక్రవారం చేవెళ్ల కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్అదాలత్‌లో మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 40 మందిపై రూ.67 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంతోనే సరి!


బీటీ రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం


ఆలూర్ నుంచి న్యాలట వెళ్లే మట్టి రోడ్డు

రెండేళ్లు దాటినా ప్రారంభం కాని పనులు

అధ్వానంగా ఆలూర్ - న్యాలట రోడ్డు

కంకర తేలడంతో తప్పని అవస్థలు

పట్టించుకోని అధికారులు, పాలకులు

చేవెళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూర్ గ్రామం నుంచి న్యాలట గ్రామం వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. అప్పుడు మంత్రులుగా ఉన్న సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ప్రజాప్రతినిధులు ఎంతో ఆర్భాటంగా 7 సెప్టెంబరు 2023న రూ.4 కోట్ల 50 లక్షలతో బీటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శిలాఫలకం వేసి రెండేళ్లు దాటినా తట్టెడు మట్టికూడా వేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆలూరు ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

ఆలురు గ్రామంపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజురై రెండు సంవత్సరాలు పూర్తయినా రోడ్డు పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని ఆరోపిస్తున్నారు. హైదరాబాద్, బీజాపూర్ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారడంతో అధికారులు మార్గ మధ్యలో నుంచి ఉన్న రోడ్డు గుండా వెళ్తున్నారు. వర్షం పడితే రోడ్డుపై వాహనాలు వెళ్లడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఓట్ల కోసం వచ్చిన నేతాలంతా బీటీ రోడ్డు పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి రెండేళ్లు అవుతున్నా పట్టించుకునే నాథుడే కారువైయ్యాడని ఆలూరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు ప్రారంభం కాలె..



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలూరు గ్రామం నుంచి న్యాలట రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికి రెండేళ్లు దాటినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. నిధులు మంజూరు అయ్యాక పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అధికారులు, పాలకులు సమస్యను గుర్తించాలి.

- తోట చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఆలూర్ గ్రామానికి నక్ష రోడ్డు బీటి రోడ్డుగా మారుస్తున్నమాని చెప్పిన గత ప్రభుత్వం శిలాపలకం వేసి రెండేళ్లయింది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు చేవెళ్ల పట్టణ కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి.

- ఆంజనేయులు యాదవ్, బీజేపీ నాయకుడు, ఆలూరు

సహకార రంగంలో సమూల మార్పులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


కేశవరెడ్డికి ఉత్తర్వు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

తలకొండపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ సహకార రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి పీఏసీఎస్ పాలక వర్గం కాలపరిమితిని పెంచుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం పీఏసీఎస్ ఛైర్మన్ గట్ల కేశవ రెడ్డి, డైరెక్టర్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కాలపరిమితి పెంపు ఉత్తర్వులు కేశవ రెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు. సకాలంలో పంట రుణాలు అందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. యూరియా కొరత రాకుండా, సకాలంలో రైతులకు పంపిణీ చేయాలని పాలక వర్గానికి కసిరెడ్డి ఆదేశించారు. కేంద్రం రాష్ట్రానికి తగినంత మేర యూరియా కేటాయింపులు చేయకపోవడం వల్లే ఇబ్బందులు వచ్చాయని చెప్పారు. విపక్షాల ఉచ్చులో పడి రైతులు నష్టపోవద్దని సూచించారు. సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షలలోపు పంట రుణాలను సీఎం రేవంత్ రెడ్డి మాఫీ చేశారని పేర్కొన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువులు, కుంటలు, గ్రామీణ రోడ్ల మరమ్మతులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం, సురేందర్ రెడ్డి, వెంకటయ్య, సుమన్, వెంకటేశ్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు అర్హులను గుర్తించండి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


అభివృద్ధి, సంక్షేమంపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు ఇందిరమ్మ కమిటీలతో కలిసి అర్హులను గుర్తించాలని వార్డు అధికారులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటేషన్‌పై ఇతర మున్సిపాలిటీలకు వెళ్లిన అధికారులను తిరిగి రప్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ. 55 కోట్లతో శాశ్వత పరిష్కారం

తాండూరులో తాగు నీటి సరఫరాకు సంబంధించి పురాతన పైపులైన్లను మార్చడంతోపాటు ఒక రిజర్వాయర్ ఏర్పాటుకు రూ.55 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో అవసరమైన చోట సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే లారీ పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించామని తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పాటునందించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. కందుకూరు మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 3వ మహాసభకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల టీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఆమనగల్లు బ్లాక్ సమన్వయ కమిటీ అధ్యక్షుడు యూనుస్, జిల్లా నాయకుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు చంద్రకుమార్, యూనియన్ అధ్యక్షుడు దురువుల శంకర్, గౌరవాధ్యక్షుడు రాచాలపల్లి నర్సింహ, నాయకులు తిరుపతి, నాయకులు తావుర్య నాయక్, విజేందర్‌రెడ్డి, బుచ్చిబాబు, శివకుమార్, రఘుపతిరెడ్డి, రాజవర్ధన్ రెడి ఉన్నారు.

నేడు జర్నలిస్టులకు వైద్యశిబిరం

ఆమనగల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆమనగల్లు పట్టణంలో జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. వన్ మెడిహబ్, ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ కమిటీ ప్రకటన



స్వదేశీ జాగరణ్ మంచ్ కమిటీ సభ్యులు

వికారాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కమిటీని శుక్రవారం ప్రకటించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాలమూరు విభాగ్ సహ కార్యవాహ కేరెల్లి అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ రూపుదిద్దుకుంది. ఈ కమిటీలో భాను మహేందర్ రెడ్డి జిల్లా కన్వీనర్‌గా ఎం.సుజాత మహిళా కన్వీనర్‌గా ఎల్.మహేందర్ రెడ్డి పర్యావరణ ప్రముఖ్‌గా ప్రేమ్‌కుమార్ ప్రచార ప్రముఖ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే కోకన్వీనర్లుగా కె.వెంకట్(వికారాబాద్), ఈ.ంజనేయులు(పరిగి), శివశంకర్ (తాండూరు), భాను ప్రకాశ్‌లొంటే(కొడంగల్) నియమితులయ్యారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర కోకన్వీనర్ ఈశ్వర్ పాలమూరు విభాగ్ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, విభాగ్ కుటుంబ ప్రబోధక్ ఎలకంటి పురుషోత్తం, వికారాబాద్ కన్వీనర్ సురేష్ గౌడ్, పరిగి కన్వీనర్ కోస్గి కృష్ణ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విడవని వాన


గట్టేపల్లి తండా వద్ద రోడ్డుపై వరద


రాంపూర్ తండాలో దెబ్బతిన్న వేరుశనగ పంట

ధారూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వాన వీడడం లేదు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు మండలంలో వర్షం దంచి కొట్టింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు ప్రవహిస్తున్నాయి. గట్టేపల్లి అడవిలోని బాలోని కుంట నీరు గట్టేపల్లి చెరువులోకి దూకడంతో చెరువులోని నీరు గట్టేపల్లి తండా సమీపంలోని రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో గట్టేపల్లి నుంచి ధారూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రారం రోడ్డు ద్వారా గట్టేపల్లి వాసులు ధారూరుకు రాకపోకలు సాగించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో శుక్రవారం సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. బ్రాహ్మణ వర్గంలో పుట్టినా అట్టడుగు వర్గాల ప్రజల కోసం ఏచూరీ చేసిన సేవలు మరువలేమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు సామేల్, నర్సింహ, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, బుగ్గరాములు, ఎల్లేష్, పురుషోత్తం, శారద, అరుణ పాల్గొన్నారు.

కుక్కలకు తప్పనిసరిగా టీకా వేయించాలి



కుక్కలకు టీకా వేస్తున్న బ్లూక్రాస్ సిబ్బంది

శామీర్‌పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుక్కలకు యజమానులు ఏడాదికోసారి యాంటి రేబీస్ టీకా వేయించాలని బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ కుమారి సూచించారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద బ్లూక్రాస్, డబ్ల్యువీఎస్, మిషన్ రేబీస్, తూంకుంట మున్సిపల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన యాంటి రేబీస్ టీకా వ్యాక్సినేషన్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ బ్లూక్రాస్ వారి సహకారంతో మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో యాంటి రేబీస్ టీకా మొబైల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తూంకుంట పరిధిలో మొత్తం 190 పెంపుడు, వీధి కుక్కలకు ఏఆర్‌వి టీకాలు వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కీసర రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ స్థలాల కబ్జాకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కీసర మండల పరిధిలోని నాగారం మున్సిపల్ టౌన్‌లోని సర్వే నంబర్ 83 చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసైన్డ్ స్థలాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించటంతోపాటు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సాధన ఎన్జీవో సభ్యులు

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అన్ని మతాల పెద్దలు కృషి చేయాలని సాధన ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ యాదవ్ కోరారు. శుక్రవారం అనంతపద్మనాభస్వామి ఆలయంలో పురోహితులు, పలు మసీదుల్లో ఖాజీలతో సాధన ఎన్జీఓ ప్రతినిధులు బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. బాల్య వివాహం చేయడతో కొంత మంది నిరక్షరాస్యులుగా మారిపోతున్నారని, గృహ హింసకు గురై మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రసూతి, శిశు మరణాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నర్సింహులు, రమేష్, రోజా, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు

మొయినాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరాంనగర్, చాకలిగూడ, నక్కలపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కేంద్రం అత్యధికంగా నిధులు ఇస్తున్నదని తెలిపారు. పేదల సంక్షేమానికి మోది సర్కార్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు శ్రీరాంనగర్ ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్ రెడ్డి, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

» ఏసీపీ వెంకట్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాలపై చర్చిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శామీర్‌పేట వద్ద రాజీవ్‌రహదారిలో సరైన రోడ్లు, సిగ్నల్స్ లేక రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని, నివారణకు వెంటనే పరిష్కార మార్గాలను అన్వేశించాలని గురువారం ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఏసీపీ వెంకట్‌రెడ్డి శామీర్‌పేట వద్ద రాజీవ్‌రహదారి సర్వీస్‌రోడ్డులో, నల్సార్ జంక్షన్‌లో జరుగుతున్న డేంజర్ జోన్ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక నాయకులతో కలిసి చర్చించారు. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, యూటర్న్ చేసేటప్పుడు నిదానంగా వెళ్లాలని సూచించారు. త్వరలోనే రోడ్డు ప్రమాదల నివారణకు కట్టు దిట్టమైన భద్రత చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, తూంకుంట మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 నిర్వహణపై విచారణ జరిపించాలి



చేవెళ్లలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

చేవెళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నందున సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షను తిరిగి నిర్వహించి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకుల ఆధ్వర్యంలో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, టీజీపీఎస్సీ వైఫల్యం కారణంగా అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని వాపోయారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్, రాఘవేందర్, రవికుమార్, పృథ్వీరాజ్, పాండు, సతీష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

» జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గట్టుపల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కాంగ్రెస్ ముఖ్యనాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. నాయకులు కె.రాకేష్‌రెడ్డి, పాండునాయక్, యాదయ్య, వెంకటేష్, శ్రీనివాస్, కమళమ్మ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 'ఆవోపా' సేవలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదపిల్లల విద్యాభివృద్ధికి ఆవోపా(ఆర్యవైశ్య అధికారుల సంక్షేమ సంఘం) విశేష సేవలు అందిస్తున్నదని ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ తెలిపారు. షాద్‌నగర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆవోపా రంగారెడ్డి జిల్లా రూరల్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా షాద్‌నగర్‌కు చెందిన తాటి రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శిగా గుగ్గిళ్ల బాలరాజేష్, కోశాధికారిగా గుడిపల్లి వెంకటరమణ, అదనపు సెక్రటరీగా ఎంవీఎస్ సురేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భీమ్‌శెట్టి శ్రీనివాస్‌గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా పెంద్యాల నీరజ, ప్రధాన కార్యదర్శిగా తాటి సుమలత, కోశాధికారిగా భీమ్‌శెట్టి సురేఖ, అదనపు ప్రధాన కార్యదర్శిగా దండు శిరిష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పసుపుల కవితలచే శంకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు నాగిళ్ల గోపాల్ గుప్తా, వందనపు శిల్ప, కట్టా రవి, గందే సురేష్, మలిపెద్ది శ్రీనివాస్‌గుప్త, టి.స్వరాజ్‌బాబు, పెంద్యాల జగదీశ్వర్, నాగరాజు, నందకిషోర్, ఎలుకుర్తి నారాయణ, శ్రీలత, కల్వ మాణిక్యం కల్వ మధుప్రియ, ఎంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్ పాల్గొన్నారు.

ఈ రోజైనా దొరికేనా..

» యూరియా కోసం క్యూలో రైతన్నలు

» గంటల తరబడి పడిగాపులు

» ఒక్కో రైతుకు ఒక్క బస్తానే..

పరిగి/యాచారం/కొడంగల్ రూరల్/మోమిన్‌పేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. నెలలు గడుస్తున్నా ఎరువు సమస్య తీరడం లేదు. ఆగస్టు మొదటివారం నుంచి రైతులు యూరియా బస్తాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం సైతం ఎరువుల దుకాణాలు, సొసైటీలు, రైతు వేదికల వద్ద రైతన్నలు పడిగాపులు కాశారు. ఈ రోజైనా దొరుకుద్దని క్యూలో గంటల తరబడి నిలబడ్డారు. అందరికీ బస్తాలు దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. యూరియా కోసం పరిగిలోని ఆగ్రోస్, లక్ష్మీ, మనగ్రోమోర్ ఏజెన్సీల వద్ద బారులు తీరారు. యాచారం మండలంలో రెండు రోజుల ముందు పోలీస్ అధికారుల సమక్షంలో సొసైటీ అధికారులు రైతులకు స్లిప్‌లు ఇచ్చి యూరియా అందిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో మండలంలో 900 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం రైతు వేదికలో 220 బస్తాలు, రుద్రారం రైతు వేదికలో 220 యూరియా బస్తాలను రైతులకు అందించారు. రైతులు ఆందోళన చెందొద్దని మోమిన్‌పేట్ మండల వ్యవసాయ శాఖ అధికారి జయశంకర్ అన్నారు. మేకవనంపల్లి, మోమిన్‌పేట్ సొసైటీల్లో నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. మేకవనంపల్లిలో 150 బస్తాలు, మోమిన్‌పేట్‌లో 100 బస్తాలు యూరియా అందుబాటులో ఉందని అవసరమైతే మరో రెండు లారీల యూరియాను తీసుకొవచ్చి రైతులకు అందిస్తామన్నారు.



యాచారం రైతు వేదికలో యూరియా కోసం రైతుల పడిగాపులు



పరిగిలో ఎరువుల దుకాణం వద్ద క్యూలో రైతులు



రుద్రారం రైతు వేదికలో టోకెన్‌లు తీసుకుంటున్న రైతులు



మోమిన్‌పేట్: మేకవనంపల్లిలో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సాగు కళకళ

(ఐదో పేజీ తరువాయి)

వర్షపాతం కురిసింది. మూడు జిల్లాల్లో ఆగస్టు నెలలో సగటుకు దాదాపు రెట్టింపు స్థాయిలో వర్షాలు కురిశాయి. అన్ని ప్రాంతాల్లో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. భూగర్భజలాలు దండిగా పెరిగాయి. దీంతో పంటలకు ఇక ఢోకా లేదు. ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. వచ్చే రబీ (యాసంగి సీజన్)లో కూడా నీటి కొరత ఉండే అవకాశం లేదు. అయితే ప్రస్తుత వర్షాలతో పంటలు కళకళలాడుతున్నప్పటికీ రైతులకు ఎరువుల కొరత ఇబ్బందికరంగా మారింది. అనేక చోట్ల యూరియా కోసం రైతులు యుద్ధం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దిగుబడులపై ప్రభావం పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రంగారెడ్డిలో సగటుకు మించి వరి, మొక్కజొన్న సాగు

మూడు జిల్లాల్లో ఆయా పంటల సాగు గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలను రైతులు అధికంగా వేశారు. రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,84,020 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 3,63,649 ఎకరాల్లో (94.7శాతం) వేశారు. సగటుకు మించి వరి, మొక్కజొన్న రైతులు సాగు చేశారు. ఈ సీజన్‌లో 1,21,286 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే 1,27,420 ఎకరాల్లో వేశారు. ఇంకా వరి సాగు పెరగవచ్చని అధికారులు తెలిపారు. అలాగే 56133 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేయాల్సి ఉండగా అంతకు మించి 68654 ఎకరాల్లో పంట వేశారు. 1,62,771 ఎకరాల్లో పత్తి వేయాల్సి ఉండగా 1,38,780 ఎకరాల్లో సాగు చేశారు. కంది, జొన్న పంటల సాగు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు పంటల సాగు 60శాతానికి మించ లేదు.

వికారాబాద్‌లో రికార్డుస్థాయిలో పత్తిసాగు

అలాగే వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో



కోట్‌పల్లి మండలం బర్వాద్‌లో పసుపు పంట



శంకర్‌పల్లి మండలం సంకెపల్లిలో పత్తి చేను

5,94,902 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 5,46,827 ఎకరాల్లో (92.10శాతం) వేశారు. రికార్డుస్థాయిలో పత్తి, వరి పంటలు సాగు చేశారు. ఈ ఏడాది పత్తిని 2,44,390 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే అంతకు మించి 2,52,194 ఎకరాల్లో (103శాతం) పంట వేశారు. 1.47లక్షల ఎకరాల్లో కంది సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1.05లక్షల ఎకరాల్లో పంట వేశారు. అలాగే 119290 ఎకరాల్లో వరి చేయాలని నిర్ణయించగా అంతకు మించి 1,30,549 ఎకరాల్లో సాగు చేశారు. వరి పంట మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక మొక్కజొన్న 42166 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 30,366 ఎకరాల్లో పంటను చేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 23430 ఎకరాల్లో పంటలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 20920 ఎకరాల్లో (89.28శాతం) సాగు చేశారు.

రైతులను వేధిస్తున్న యూరియా కొరత

పంటలు సాగు పెరిగినా మూడు జిల్లాల్లో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అయితే మార్కెట్‌లో సరిపడా దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లో ఇదేపరిస్థితి నెలకొంది. యూరియా కోసం ఎరువుల దుకాణాల వద్ద రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. తెల్లవారుజామునే షాపుల వద్ద రైతులు క్యూ కట్టి పడిగాపులు కాస్తున్నారు. యూరియా కొరత కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పులు మొదలయ్యాయి. రైతులకు సరిపడా కేంద్రం నుంచి యూరియా సరఫరా లేకపోవడంతో వచ్చిన దానిని సర్దుబాటు చేయలేక రాష్ట్ర ప్రభుత్వం సతమతమవుతోంది. యూరియా కోసం రైతులు అనేక చోట్ల రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. యూరియా సమస్యలపై ప్రతిపక్షాలు నిత్యం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. త్వరలో స్థానిక ఎన్నికలు ఉండడంతో అధికార కాంగ్రెస్‌కు ఈ సమస్య పెద్ద తలనొప్పిగా మారింది.

దిడ్డివాగులో గల్లంతైన వ్యక్తి మృతి

» మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు అందజేసిన ఎమ్మెల్యే

» వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆదేశాలు



బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబర్ 12, (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం దిడ్డివాగులో గల్లంతైన వ్యక్తి శవమై కనిపించాడు. సంగెంకలాన్ గ్రామానికి చెందిన బుక్కంపల్లి మొగులప్ప(47) గురువారం చెట్టినాడు కర్మాగారం - సంగెంకలాన్ మధ్య దిడ్డివాగును దాటుతుండగా నీటి ఉధృతికి గల్లంతైన విషయం తెలిసిందే. నీటి ఉధృతి కారణంగా అధికారులకు గాలింపు చర్యల్లో ఇబ్బందులు తలెత్తాయి. శుక్రవారం తాండూరు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జలేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎస్‌డీఆర్‌ఎఫ్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) 16 మంది సిబ్బంది దిడ్డి వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. వీరు గ్రామ యువకుల సాయంతో గాలించారు. కాగా, దిడ్డివాగు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని గ్రామ సమీపంలోని బొంగరంమోట ప్రాంతంలో మొగులప్ప మృతదేహం ఓ చెట్టుకు తట్టుకున్నట్లు గుర్తించారు. ఫైర్ సిబ్బంది అక్కడి నుంచి మృతదేహాన్ని బయటికి తీసుకువచ్చారు. అనంతరం మృతుని బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో గ్రామంలో బైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ భీష్మించారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి విషయం వివరించారు. ఎమ్మెల్యే, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల విలువైన చెక్కును, అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల నగదును అందజేశారు. రైతుబీమా, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. వాగుపై బ్రిడ్జి నిర్మించే విధంగా చూడాలని కర్మాగారం యాజమాన్యాన్ని ఆదేశించారు. సంగెంకలాన్‌లో రెండు వాగులకు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇంచ్చారు. మృతుని కుటుంబంలో చెట్టినాడు కర్మాగారంలో ఒకరికి ఉద్యోగంతో పాటు ప్రభుత్వం నుంచి అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, రాందాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విజయ్‌భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్ గౌడ్, నాపగప్ప, జగదీశ్వర్ ఉన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రావుగళ్ల బాబు

మహేశ్వరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళల పింఛన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయాలు, 20న గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ పేర్కొన్నారు. ఈమేరకు మహాధర్నాకు సంబంధించి శుక్రవారం తుక్కుగూడలో సన్నాహక సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని పింఛన్‌దారులకు అండగా మంద కృష్ణ మాదిగ పోరాటాలకు సిద్ధమయ్యారని.. అందులో భాగంగానే ఈనెల 15, 20వ తేదీల్లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు. పింఛన్‌దారులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు బక్కని రవి, నర్సింహ, నాగభూషణ్, గణేష్, కృష్ణ, నవీన్, శ్రీశైలం, బాల్‌రాజ్, దానయ్య, అనీష్ పాల్గొన్నారు.

ఖజానా ఖాళీగా ఉన్నా 'కల్యాణలక్ష్మి'

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/కొత్తూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కొత్తూరు, నందిగామ మండలాల పరిధిలోని 80 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల విలువైన చెక్కులను స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంపై అప్పుల భారం ఉన్నా పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అలాగే కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ శివారులోని హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాలో కడప పీర్ బాయి ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి చాదర్‌ను దర్గాకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, కాంగ్రెస్ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ, నాయకులు ఆగీర్ రవికుమార్ గుప్తా, ఎల్లారం శేఖర్‌రెడ్డి, రఘు, లింగంనాయక్, బాల్‌రాజ్‌గౌడ్, కొమ్ము కృష్ణ, అన్వర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాగిరెడ్డి తదితరులు

మొయినాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) ప్రకృతిని విధ్వంసం చేయడమంటే ప్రజలపై యుద్ధం చేయడమేనని రైతుకూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి చిలుకూరులో బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. శాంతి స్వావలంబన కోసం ఈనెల 20 నుంచి అక్టోబరు 3 వరకు బహుజన బతుకమ్మ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న చిలుకూరులో బహుజన బతుకమ్మ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి విమలక్క, అరుణోదయ బృందం హాజరవుతున్నట్లు తెలిపారు. మహిళలు అత్యక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. చిలుకూరు మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి, జెకరయ్య, మోహన్, కుమార్, ఈశ్వరయ్య, రాము, ప్రభాకర్, యాదయ్య, రవికుమార్. తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి

» రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్నాశివారెడ్డి

కీసర, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్నాశివారెడ్డి అన్నారు. శుక్రవారం కీసరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, తదితర వివరాలను ప్రధానోపాధ్యాయుడు వంగేటి రాంరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో వంటశాలకు తాళం వేసుకున్నాడని ఉపాధ్యాయుడు తెలిపారు. స్పందించిన ఆమె కలెక్టర్ మన్ను చౌదరికి ఫోన్ చేసి సమస్యలను వివరించారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. 7, 8వ తరగతికి చెందిన కొంత మంది విద్యార్థులు తెలుగు మీడియంలోనే ఉన్నారని, వారిని ఇంగ్లిష్ మీడియంలోకి మార్చాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. వారం రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని, తాను కూడా హాజరు అవుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జమదగ్ని పాల్గొన్నారు.



రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బీజేపీ చీఫ్‌కు నాయకుల శుభాకాంక్షలు

కేశంపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు కేశంపేట బీజేపీ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. యువ మోర్చా మాజీ అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్, సీనియర్ నాయకుడు రాము, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తట్టేపల్లి నరసింహ, మల్లికార్జున్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అందె శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలుగెత్తిన ప్రాజెక్టులు

(ఐదో పేజీ తరువాయి)

ఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. చెరువు కట్టలకు గండ్లు పడకుండా జాగ్రత్త పడుతున్నారు. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో యాలాల, ధారూరు, తాండూరు, దోమ మండలాల్లో వరద ఉధృతికి నాలుగు చెరువులకు గండ్లు పడగా, వాటిని పూడ్చేందుకు ఇరిగేషన్ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.


శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద గ్రామస్థుల పూజలు

అలుగుపారుతున్న శామీర్‌పేట పెద్దచెరువు

గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి, వరదనీటి ఉధృతికి శామీర్‌పేట పెద్ద చెరువు నీటితో నిండి అలుగు పారుతు కళకళలాడుతోంది. 1200 ఎకరాల విస్తీర్ణంతో, ఏడు గజాల గుండు, 33 పీట్ల లోతుగా ఉన్న శామీర్‌పేట పెద్ద చెరువు ఎట్టకేలకు శుక్రవారం ఉదయం ఆరు గంటల వరకు వరద నీటితో నిండి అలుగు పారడం ఆరంభమైంది. ఈ సందర్భంగా శుక్రవారం కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మ్యాకల మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, భక్తులు పెద్ద చెరువు వరకు గటం కుండను ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా భారీ ర్యాలీతో విచ్చేసి ఆ చెరువు పారుతున్న అలుగు వద్ద నీటిలో గంగమ్మ తల్లికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆ పెద్ద చెరువు వద్ద వారు అత్యంత ఆనందోత్సవాలతో నీటితో నిండి కళకళలాడుతున్న సందర్భంగా వారు ఎంతో ఉత్సహంగా రంగులను చల్లుకుంటు సంబరాలను జరుపుకున్నారు.


నిండుకుండలా శామీర్‌పేట పెద్దచెరువు

'అనురాగ్'లో ఐడియాట్రానిక్స్ 2కె25


కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 12: పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం విద్యార్థుల కోసం ఐడియాట్రానిక్స్ 2కె25 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈసీఈ డీన్ హరికృష్ణ కమతం పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ఐడియాట్రానిక్స్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగు విజయ్‌కుమార్, అధ్యాపకులు నరేందర్‌సింగ్, మనోజ్‌కుమార్, ఐడియాట్రానిక్స్ ప్రోగ్రాం సమన్వయకర్తలు హేమలత పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్



మర్పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. త్వరలోనే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


వసతి గృహంలో వంట సామగ్రి పరిశీలిస్తున్న కమలాకర్

యాలాల, సెప్టెంబరు 12, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా షెడ్యూల్డు కులాల అధికారి కమలాకర్‌రెడ్డి అన్నారు. ఆయన మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ అధికారి పాండు, వసతి గృహ సంక్షేమ అధికారులు హన్మంత్‌రెడ్డి, రాధిక, రాజేష్, వరలక్ష్మి, గోవింద్ ఉన్నారు.

మట్టిలో దిగబడిన లారీ


పర్సాపూర్ దగ్గర రోడ్డు మధ్యలో దిగబడిన లారీ

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్ 167-ఎన్ పనుల్లో భాగంగా కొడంగల్ మండలంలోని పర్సాపూర్ వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శుక్రవారం ఉదయం కోస్గి వైపు నుంచి లోడ్‌తో వస్తున్న లారీ తాండూర్ వైపు వెళుతుండగా పర్సాపూర్ వద్ద మట్టిలో దిగబడింది. దీంతో గంటకుపైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ జీవీ సత్యనారాయణ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో లారీని బయటకు తీయించారు. గుంతల్లో కంకర, మట్టి వేయించి రోడ్డు రోలర్ ద్వారా చదును చేయించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సంబంధింత కాంట్రాక్టర్ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తల్లిప్రేమ చాటుతున్న ఆవు


మంతన్‌గౌడ్‌లో మేక పిల్లకు పాలిస్తున్న ఆవు

బషీరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమ్మ.. అంటే ఎవరికైనా అమ్మే అని ఓ ఆవు నిరూపించింది. తన బిడ్డతో పాటు ఓ మేక పిల్లకు పాలు ఇస్తోంది. బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్ తండాకు చెందిన హోటల్ దేవ్యానాయక్‌కు చెందిన ఆవులతో పాటు మేకలు పెంచుతున్నారు. కాగా ఇటీవల మేకపిల్ల తల్లి మృత్యువాతపడగా ఆవు తన బిడ్డతో పాటు మేకపిల్లకు ప్రతీరోజు పాలు ఇస్తోంది. ఇది చూసిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తాండూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగెంకలాన్ గ్రామంలో నీటి ఉధృతుకి వాగులో గల్లంతై మృతి చెందిన బుక్తంపల్లి మొగులప్ప కుటుంబానికి జిల్లా బీజేపీ మోర్చా ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా బీజేపీ యువమోర్చా ఉపాధ్యక్షుడు కాళ్ల సంజీవరెడ్డి శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు అందజేశారు.

దుద్యాల: హకీంపేట్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్‌ను పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. అదే విధంగా దుద్యాల మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ తండ్రి మృతి చెందడంతో కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మదన్, బాబయ్యానాయుడు, బందెప్ప, పాండు, జగదీశ్, శివకుమార్ పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

● మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు, సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వికారాబాద్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు పడిగళ్ల అశోక్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు గయాజ్, ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్, నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి ఆశయసాధనకు కృషి చేయాలి


పరిగి: సీతారాం ఏచూరి చిత్రపటానికిపూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, సత్తయ్య, చెన్నారెడ్డి, మొగులయ్య, రాంచంద్రయ్య, బాలు, శ్రీశైలం పాల్గొన్నారు.

దుద్యాల: సీతారాం ఏచూరి వర్ధంతిని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా నాయకుడు బస్సు చంద్రయ్య తదితరులు ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, రమేశ్, చిన్నయ్య, శ్రీను, రవీందర్, అనసూజ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


తాండూరు: ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తాండూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడానికి గురవందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాండూరు నియోజకవర్గ కన్వీనర్ ఎ.శ్రీశైలం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.హన్మంత్‌రావు, రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు, జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బషీరాబాద్ ఎంఈవో డి.రాములు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) కొడంగల్‌లో శుక్రవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో నూతన జీహెచ్‌ఎంగా పదోన్నతిపై వచ్చిన జాక వెంకటేశంను స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌పై పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్ రెడ్డి, నరహరి రెడ్డి, శ్రీనివాసులు, స్కూల్ అసిస్టెంట్ సోషల్ అబ్దుల్‌హక్, వెంకటేశంలను వికారాబాద్ జిల్లా గణిత ఫోరం, వికారాబాద్ జిల్లా సోషల్ ఫోరం పక్షాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, వేణుగోపాల్, మల్లయ్య, అనిల్ కుమార్ పాల్గొన్నారు.


కొడంగల్ రూరల్: సన్మానం పొందిన ఉపాధ్యాయులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

తాండూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తాండూరు ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కోసం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శివప్రద్ పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా నాయకులు బంటారం భద్రేశ్వర్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా తాండూరులో శుక్రవారం తెలంగాణ ఫ్రీకోటా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈకార్యక్రమంలో అధ్యాపక బృందం, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపక బృందం

మల్కాపూర్‌లో స్వచ్ఛభారత్


స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో గ్రామస్థులు

చౌడాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్‌లో గ్రామస్థులు స్వచ్ఛ్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రమదానం చేశారు. గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేణుక, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, గురుదేవారెడ్డి, వెంకటయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈవో


టై, బెల్టులు పంపిణీ చేస్తున్న ఎంఈవో వెంకట్

దోమ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లతండా, మెట్టుగడ్డతండా, పీర్లగుట్టతండా, బ్రహ్మణ్‌పల్లి, గంజిపల్లి, గంజిపల్లి తండా పాఠశాలలను ఎంఈవో వెంకట్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్, పాఠ్య పుస్తకాలు, యండీయం మెనేజ్, ఎఫ్ఆర్ఎస్, వంట పరికరాలు, టీఎల్ఎం విద్యాబోధన తదితర వాటిపై ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. గంజిపల్లి తండాకు చెందిన సురేశ్ విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్‌కు ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా బ్రహ్మణ్‌పల్లి, గంజిపల్లి పాఠశాలల్లో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు లాల్యానాయక్, వెంకట్‌రెడ్డి, భీమయ్య, సత్యనారాయణ, సీఆర్‌పీ రెడ్యానాయక్ పాల్గొన్నారు .

తాళ్లపల్లి సరోజమ్మకు చీఫ్‌విప్ నివాళి


నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాలాల మాజీ ఎంపీపీ, బీజేపీ నాయకులు బాలేశ్వర్‌గుప్తా తల్లి సరోజమ్మ ద్వాదశ దినకర్మలో శాసన మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార సమన్వయ కర్త కరుణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ ఉన్నారు.

కల్వర్టు లేక రోడ్డుపైకి నీరు


కల్వర్టు లేక రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

కోట్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): అన్నసాగర్ గ్రామ సమీపంలోని ఓ మూలమలుపు వద్ద దాదాపు 8, 10 సంవత్సరాల క్రితం సింగిల్ రోడ్డు ఉండేది. అప్పుడు కల్వర్టు ఉండేదని అక్కడున్న రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం డబుల్ రోడ్డు కావడంతో వర్షపునీరు వెళ్లే మార్గంలేక రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతనంగా కల్వర్టు నిర్మించాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ


కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కొడంగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని శుక్రవారం ముస్లింలు కొడంగల్‌లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జామే మసీద్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు మిలాద్ ఉన్ నబీ విశిష్టతను వివరించారు. అనంతరం మహిబూబ్‌సుభానీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు, యువకులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ బాలస్వామి

ఘట్‌కేసర్ రూరల్: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి కోరారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న మీలాద్ ఉన్-బీ ర్యాలీని శాంతియుతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ షేక్ హీనా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● పెళ్లైన నెల రోజులకే విషాదం


బబ్లూకుమార్ యాదవ్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు పెళ్లైన నెలరోజులకే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజు వర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఝార్ఖండ్‌లోని తిర్సి జిల్లా, లోకే గ్రామానికి చెందిన బబ్లూకుమార్ యాదవ్(19)కు నెల రోజుల క్రితమే లలిత యాదవ్‌తో వివాహం జరిగింది. భార్యభర్తలు జీవనోపాధికి పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడ వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. బబ్లూకుమార్ ఆటో డ్రైవింగ్ చేస్తుంటాడు. శుక్రవారం వేకువజామున ఇంట్లో తాగునీరు లేకపోవడంతో తీసుకురావడానికి రోడ్డుపైకి వచ్చాడు. అన్నోజిగూడ తులిప్ హోటల్ సమీపంలో బబ్లూ కుమార్ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తన భర్త ఇంకా ఇంటికి రాలేదని భార్య లలిత ఫోన్‌చేయగా పోలీసులు మాట్లాడి విషయాన్ని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వృద్ధుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన బుక్కసముద్రం చంద్రారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం హోండా యాక్టీవాపై దుకాణంలో సరుకులు తీసుకురావడానికి ఎన్టీపీసీ చౌరస్తాకు వెళ్లాడు. అన్నోజిగూడకు చెందిన మిన్ను(16) తన యాక్టీవాపై సర్వీసురోడ్డులో వచ్చి అటుగా వస్తున్న చంద్రారెడ్డి యాక్టీవాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రారెడ్డి తలకు బలమైన గాయం కావడంతో చెవులు, ముక్కులో నుంచి రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో మూడేళ్లు జైలు శిక్ష

కొడంగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్ష, ఏడుగురికి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన బేరకోటి మల్లప్ప వారి కూతురును ప్రేమిస్తున్నా అని పెళ్లి సంబంధాలను చెడగొడుతున్నాడనే ఉద్దేశంతో బేరకోటి మల్లప్పపై పలువురు ఇనుప రాడ్‌తో దాడి చేయగా గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన బండిసాయప్ప, అబ్బులప్ప, తిరుమలప్ప, బొట్టు తిరుమలప్ప, బొట్టు సాయప్ప, అబ్బులప్ప, బొట్టు మల్లమ్మ, హన్మమ్మలపై కేసు నమోదైంది. ఈ ఘటనపై బేరకోటి మల్లప్ప అన్న బేరకోటి సాయప్ప కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ శేఖర్‌గౌడ్ కేసు నమోదుతో దర్యాప్తు చేపట్టారు. చార్జ్‌షీట్‌ను కొడంగల్ మున్సిఫ్ కోర్టులో సమర్పించగా వాదోపవాదాలు విన్న తర్వాత బండి సాయప్పకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. అదేవిధంగా మిగతా ఏడుగురికి రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీరామ్ తీర్పు నిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

కీసర రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు విరుచుకుపడ్డారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి చీర్యాల్‌లోని గట్టు మైసమ్మ ఆలయంలో గురువారం అర్ధరాత్రి తలుపులు విరగ్గొట్టి అమ్మవారి విగ్రహంపైన ఉన్న బంగారు ముక్కుపుడక, ఇత్తడి గంటలు, హుండీలను అపహరించుకెళ్లారు. అదేవిధంగా ఇళ్ల ముందు నిలిపి ఉన్న వాహనాల బ్యాటరీలను దొంగిలించారు. చోరీ తాలూకు దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో బాధితులు కీసర పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

ధారూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జీడిగడ్డ తండాకు చెందిన రైతు నేనావత్ రాములుకు చెందిన ఎద్దు శుక్రవారం రోడ్డుపక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఎద్దు విలువ రూ.70 వేలు ఉంటుందని బాధితుడు రాములు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత


సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న కానిస్టేబుల్ శ్రీశైలం

దుద్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి కానిస్టేబుల్‌లు శ్రీశైలం, కృష్ణ శుక్రవారం దుద్యాల పోలీస్‌స్టేషన్‌లో అందించారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ తన సెల్‌ఫోన్‌ను సంగాయిపల్లి గ్రామశివారులో పోగొట్టుకున్నాడు. అదేవిధంగా కుదురుమళ్ల గ్రామానికి చెందిన దస్తప్ప తన ఫోన్‌ను సొంత గ్రామంలో పోగొట్టుకున్నాడు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేశారు.

తనయుడికి కొరివి పెట్టిన తల్లి


కొరివి పెడుతున్న గౌరమ్మ

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కన్న తల్లి తనయుడికి కొరివిపెట్టిన ఘటన గుండ్లపోచంపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న గౌరమ్మకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు పవన్ అలియాస్ నరేశ్(18). ఆమె భర్త 12సంవత్సరాల క్రితం మృతిచెందాడు. వారం రోజుల క్రితం కుమారుడు నరేశ్ బైక్‌పైనుంచి జారి పడటంతో తలకు బలమైన గాయమై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఇంట్లో మగదిక్కు లేకపోవటంతో తల్లి గౌరమ్మ బరువెక్కిన గుండెతో తన కొడుకుకు తలకొరివి పెట్టింది. భర్త లేకున్నా గౌరమ్మ కొడుకును బాగా చదివించింది. నరేశ్ బీఆర్‌కే కళాశాలలో ఫ్రీగా బీటెక్‌లో సీటు సంపాదించాడు. చేతికొచ్చిన కొడుకు ఇక తమ కష్టాలు తీరుస్తాడనుకుంటున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆ కుటుంబంలో విషాదం మిగిల్చింది. ప్రభుత్వం గౌరమ్మకు అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.


నరేశ్(ఫైల్)

కల్లు దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

● శామీర్‌పేట సీఐ శ్రీనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనాథ్

శామీర్‌పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు భద్రత చర్యల్లో భాగంగా కల్లు దుకాణాల్లో వ్యాపారులు కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ శ్రీనాథ్ సూచించారు. శామీర్‌పేట పోలీసుస్టేషన్‌లో శుక్రవారం శామీర్‌పేట మండలంలోని కల్లు దుకాణాల వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టానికి లోబడి ప్రభుత్వ నియమనిబంధనల మేరకు కల్లు దుకాణాలలో వ్యాపారులు సక్రమంగా నిర్వహించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఎస్ఐలు శశివర్ధన్‌రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు


శిబిరాన్ని సందర్శిస్తున్న ఎంఈవో

మోమిన్‌పేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరాన్ని సందర్శించారు. శుక్ర, మంగళవారాల్లో ఫిజియోథెరపీ శిబిరాలు మోమిన్‌పేట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.